తోటపల్లి బ్యారేజ్ వద్ద పాత కుడి,ఎడమ కాలువలకు సంబంధించి పాడైన షట్టర్స్ తక్షణమే మార్చాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం: తోటపల్లి బ్యారేజ్ వద్ద పాత కుడి,ఎడమ కాలవలకు సంబంధించి షటర్స్ పాడైపోయిన విషయంపై గత రెండు నెలలుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులు సాధన సమితి నాయకత్వంలో సంబంధిత జలవనరుల శాఖ అధికారుల దృష్టికి పలు దపాలుగా సమస్యను తీసుకెళ్లడం జరిగింది.ఇదే విషయంపై మే 26న సీతంపేటలో జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ కు,మే29న,జూన్ 4న జరిగిన స్థానిక పాలకొండసబ్ కలెక్టర్ వారి సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగాను సమస్యను పరిష్కరించాలని విన్నవించడం జరిగింది అందుకు స్పందించిన అధికారులు వారం పది రోజుల్లో పరిష్కరించి పనులు పూర్తి చేసి షట్టర్సు బిగించి జులై 15 నాటికి ఖరీఫ్ సీజన్ పంటలకు సాగునీరుకు ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు,ఇదిగో టెండర్ అదుగో పనులు అంటూ ఊరిస్తున్నారే తప్ప మాటలు చెప్పడమే కానీ నేటికే ఆ పనులు జరగకపోవడంతో మరోసారి తాజాగా సోమవారంపార్వతీపురం మన్యం జిల్లా గ్రీవెన్స్ సెల్ సందర్భంగా డిఆర్ఓ కె హేమలత దృష్టికి సమస్యను తీసుకురాగా అందుకుస్పందించిన డిఆర్ఓ సంబంధిత జల వనరుల శాఖ,ఎస్ఇ తో మాట్లాడడం జరిగింది.సంబంధిత ఫైల్ నార్త్ కోస్ట్ సిఇ దగ్గర ఉందని ఆయకట్టు రైతుల అవసరాన్ని వారి దృష్టికి తీసుకు వెళ్తానని ఆ సమస్య పరిష్కారిస్తానని హామీ ఇచ్చారుజులై 15 నాటికి షట్టర్లు సమస్య పరిష్కారం కాకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు తోటపల్లి కాలువల ఆధునీకరణ పనుల సాధన సమితి తరఫున ఉద్యమం తప్పదని జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు స్పష్టం చేశారు ఆయనతోపాటు రైతు నాయకులు రైతులుపాల్గొన్నారు.

పేద, బడుగు, బలహీనవర్గాల పక్షాన నిలిచే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర 73వ వార్షికోత్సవ వేడుకలలో జిల్లా రెవెన్యూ అధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం: తెలుగు రాష్ట్రాల్లో అణగారిన వర్గాల ప్రజలకోసం, కార్మిక, కర్షక, అసంఘటిత రంగాల వర్గాల కోసం అనునిత్యం కృషి చేస్తూ, సామాజిక సమస్యలపై స్పందిస్తున్న విశాలాంధ్ర దినపత్రిక 73వ వార్షికోత్సవం జరుపుకోవడం చాలా ఆనందాయకమని జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత తెలిపారు.విశాలాంధ్ర దిన పత్రిక 73వ వార్షికోత్సవ వేడుకలను జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించగా, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ని ఆటుపోట్లు వచ్చినా విశాలాంధ్ర పత్రికను నడపడం అభినందనీయమన్నారు. పేదల పక్షాన నిలిచే పత్రికగా విశాలాంధ్ర దినపత్రిక పేరుగాంచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ రాబర్ట్ పాల్, డిఆర్ డిఏ పిడి సుధారాణి,జిల్లా పౌర సంబంధాలఅధికారి ఎల్ రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహన రావు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, జిల్లా విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ మంతిని రమేష్ తదితర జిల్లా అధికారులు, డిపిఆర్ఓ కార్యాలయ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, కార్యాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి పై సైంటిస్టులతో పరిశీలన జరపాలి : సీపీఐ, ఏపీ రైతు సంఘం

విశాలాంధ్ర -పార్వతీపురం టౌన్: క్యాన్సర్ వ్యాదికి కారణాలు తెలుసు కొనుటకు నిపుణులు, సైంటిస్టుల తో పరిశీలన జరిపించాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని కొమరాడ మండలం గంగరేగు వలస పంచాయతీలో వైద్య సిబ్బంది వెంటనే క్యాన్సర్ వ్యాధి కి కారణాలు తెలుసుకొని వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు గంగరెగువలస ప్రజలతో ధర్నా నిర్వహించారు. అనంతరం డీ ఆర్ ఓ కే. హేమలత కి మెమోరాండం అందచేసారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు లు మాట్లాడుతూ గంగరేగు వలస పంచాయతీ పరిధిలో సుమారు 7సంవత్సరాల క్రితం స్టార్ క్రాఫ్ట్ అగ్రో కెమికల్ ప్రైవేట్ పురుగులు మందుల కంపెనీ నిర్మించారు ఆ పురుగుల మందులు తయారయ్యే సందర్భంలో వాటి వ్యర్థాలు భూములోకి వెళ్లాడముతో భూ గర్భ జలాలు విషపూరితము అవ్వడం తో గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి ప్రభలవుతుందన్నది, ఇప్పటికే 12 మంది వరకు క్యాన్సర్ బారిన పడి మృతిచెందారన్నారు. పంచాయతీ రెండు గ్రామాల్లో ప్రజలు క్యాన్సర్ బారిన ఎందుకు పడుతున్నారో ఇప్పటికీ అర్థంకాక ప్రజలు తీవ్ర భయందోళనతో ఉన్నారన్నారు. పంచాయతీలో క్యాన్సర్ వ్యాప్తికి గల కారణాలను ప్రభుత్వం ఇప్పటికి గుర్తించకపోవడం చాలా దారుణం అన్నారు.ఆనాడు జంఝావతి ప్రాజెక్ట్ పనులకై నిర్మించిన వర్క్షాప్ ను ఆక్రమించి అందులో పరుగుల మందుల కంపెనీ తాలూకా ముడిసరుకును యాజమాన్యం డంపింగ్ యార్డ్ గా చేసుకున్నారన్నారు.జిల్లా కలెక్టర్ పై విషయాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి క్యాన్సర్ వ్యాదికి కారణమైన స్టార్ క్రాఫ్ట్ అగ్రో కెమికల్ ప్రైవేట్ పురుగుల మందుల కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినతులన్నీ పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస: మండలంలో గల టీకే జమ్ము పంచాయతీలో సోమవారం జరిగిన ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎజేజియుఏ) కార్యక్రమంలో వచ్చిన వెనతులన్నీ తప్పనిసరిగా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి పరిష్కరిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కర్రి ధర్మారావు అన్నారు. ఈ పంచాయితీలో జరిగిన సభలో గిరిజనుల నుండి 134 వినతులు వచ్చాయని కాగా వీటిలో ఆధార్ సరిచేయడానికి 69 రేషన్ కార్డులకు 15 కుల ధ్రువీకరణ పత్రాలకు 14 జన్ దన్ అకౌంట్లకు 3, పెన్షన్లకు 15 ఉపాధి హామీ జాబ్ కార్డులను విడదీయడానికి 12 వినతులు అందాయని అన్నారు. సభలోనే దాదాపు అన్ని వినతులను పరిశీలించిన అధికారులు పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు శాఖల ఉన్నతాధికారులతో పాటు ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ బిడ్డిక సుగ్రీవులు వీఆర్వో దూసి తిరుపతిరావు గ్రామ కార్యదర్శి సత్యనారాయణ గ్రామ సర్పంచ్ ఏ భారతి అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

గాయత్రీ విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి : ఏఐఎస్ఎఫ్

డిఆర్ఓ కే.హేమలతకు వినతి

విశాలాంధ్ర -వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండల కేంద్రంలో గాయత్రీ విద్యాసంస్థల యజమాన్యంపై క్రిమినల్ కేసులుపెట్టి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బిరవికుమార్ డిమాండ్ చేశారు సోమవారం జిల్లాలో డిఆర్ఓ కే హేమలతకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరఘట్టం మండల కేంద్రంలోని గాయత్రి స్కూల్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు ఈ ఏడాది సైనిక్ స్కూల్ లో సీట్లు వచ్చినట్లు తప్పుడు ప్రచారాలు చేయడంపై మండిపడ్డారు.ఇంకా సీట్స్ కేటాయింపులు కాకముందే ఏ విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు.ఇ ఆ విద్యాసంస్థ నదితీరానికి దగ్గరగాఉందని ఏమాత్రం వరదలు వచ్చినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని అన్నారు.తక్షణమే సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వికాస్,చరణ్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఆటో ఢీ: 10మంది గాయాలు

విశాలాంధ్ర-బెలగాం : లారీ ఆటో ఢీకొని 10మందికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన విద్యార్థులు తమ గ్రామంలోని పాఠశాలను వేరే గ్రామంలోని మోడల్ స్కూల్లో విలీనం చేస్తున్నారని అందుకు తమ పాఠశాలను వేరే గ్రామంలో విలీనం చేయవద్దని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు పార్వతీపురం వచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి తిరిగి ఆటోలో తమ స్వగ్రామం వెళ్తుండగా పార్వతీపురం శివారు నర్శిపురం గ్రామం ముందు విజయ బ్యాంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో పెదపెంకి గ్రామానికి చెందిన పదిమంది ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు తల్లితండ్రులు సురగాల సురేష్, గర్భాపు చిన్నప్పుడు, బొడ్డాన యశ్వంత్ కుమార్, బొడ్డాన భవాని, బొడ్డాన లక్ష్మి, బొడ్డాన కార్తీక్, కోట వర్షిణి, కోట హర్షవర్ధన్, అలజంగి జాన్, కర్రి రమణమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీస్ ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జోగారావు

లారీ ఆటో ఢీకొని తన స్వంత మండలం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గాయాలపాలైన సమాచారం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు హుటాహుటిన పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి చేరుకొని వారిని పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

మున్సిపల్ కార్యాలయం లో ఏసీబీ తనిఖీలు

ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఫిర్యాదుతో మున్సిపల్ కమిషనర్ జయరాం ఇళ్ళలో, ఆఫీసులో సోదాలు

విశాలాంధ్ర-సాలూరు: పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం లో ఎసిబి అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విజయవాడలో ఎసిబి ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన ఎసిబి ఇన్స్పెక్టర్ ఎంవిఎస్ నాగరాజు ఆధ్వర్యంలో ఎసిబి సిబ్బంది 3గంటలపాటు సోదాలు నిర్వహించారు. సాలూరు మున్సిపాలిటీ కమీషనర్ ఎస్.జయరాం జూన్ 13 వ తేదీన బాధ్యతలు చేపట్టారు.అంతకుముందు విశాఖపట్నం లోని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేశారు.విశాఖపట్నం లో పనిచేసిన కాలంలో జయరాం పై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఎసిబి ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు అందింది.దీంతో ఎసిబి అధికారులు సోమవారం ఉదయం ఏకకాలంలో సాలూరు మున్సిపల్ కార్యాలయంలోనూ,విశాఖపట్నం లోని మధురవాడ లో జయరాం నివాసం లో తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయానికి ఎసిబి అధికారులు చేరుకునే సమయానికి కమీషనర్ జయరాం అందుబాటు లో లేరు. ఎసిబి అధికారులరాక ముందుగానే తెలుసుకున్న కమీషనర్ అక్కడ నుండి పరారయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి.తనిఖీల అనంతరం ఎసిబి సిఐ నాగరాజు విలేఖరులతో మాట్లాడుతూ విజయవాడలోని ఎసిబి ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుమేరకు విచారణ నిమిత్తం ఉన్నతాధి కారులు తమను పంపించారన్నారు.ప్రస్తుతం జయరాం తమ అదుపులో లేరన్నారు.తనిఖీల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.ఇదిలా ఉండగా 2023 ఆగస్ట్ నెలలో అప్పటి సాలూరు మున్సిపల్ కమీషనర్ హనుమంతు శంకర్రావు ను ఎసిబి అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.మున్సిపల్ కార్యాలయం లో ఎసిబి దాడులు జరుగుతుండటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

సహకార సంఘాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -బెలగాం : ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఉద్యోగుల యూనియన్ (పిఏసిఎస్) అధ్యక్షులు ఆర్. సత్యారావు, ఎఐటీయుసి పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో 35 సహకార సంఘాలు ఉన్నాయని అందులో సుమారుగా 102 మంది వివిధ హోదాలలో పనిచేస్తూ రైతులకు అవసరమైన పరపతి, ఎరువులు రైతులు పండించిన పంటనుప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తూ రైతులను దళారులనుండి కాపాడుతున్నారని కానీ వారి పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ముఖ్యంగా పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందికి మార్చి 31 2024 వరకు జీతాలు ఏవైతే ముగ్గురు సభ్యుల కమిటి గతంలో నిర్ణయించారో అవే జీతాలు తీసుకున్నారని, ప్రస్తుతం ఉన్న డిసిఓ అఫీషియల్ పర్సన్ ఇంచార్జిలు వచ్చిన తరువాత డిసిఓ మౌలిక ఆదేశాలతో వారి జీతాలను జీతాలుగా కాకుండా అడ్వాన్సులుగా ఇస్తున్నారన్నారు. మార్చి 31 2024 వరకు ఉన్న జీతాలను సర్-చార్జ్ చేయమని అందరికి ఆదేశాలు జారీ చేసియున్నారని కావున వారికి న్యాయం చేయవలసినదిగా కోరుచు న్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి. పాండురంగారావు, సిరిపురపు నారాయణరావు, హరీష్, గొర్లి చంటి, పి. నాగభూషణరావు, సింహాద్రి కిరణ్ అధిక సంఖ్యలో జిల్లాలోని పిఏసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతకు కూటమి ప్రభుత్వం కుట్ర...!

- యువత పోరు" నిరసన ర్యాలీ లో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

- విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి..

విశాలాంధ్ర -పాడేరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచిన ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించకుండా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచి మోసం చేసింది.మోసానికి గురైన విద్యార్థులకు, యువతకు బాసటగా నిలిచే క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన "యువత పోరు" అనే కార్యక్రమం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో, శాసన సభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన విభాగాల సంయుక్త అధ్యక్షతన సోమవారం యువత పోరు నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిఆర్వో పద్మాలతకి వినతిపత్రం అందజేశారు.ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మీడియా ముందు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాలు ఇవ్వక ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వక మోసం చేస్తూ విద్యార్థులకు విద్యా దీవెన,వసతి దీవెన, అందక లక్షలాది మంది తీవ్ర కష్టాలు పడుతున్నారని అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న వారికి ప్రభుత్వం సహకారంతో విద్యదీవెన, వసతి దీవెన లాంటి పథకాలు ఈ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు దానివల్ల విద్యార్థుల తల్లితండ్రులు అధిక వడ్డీలకు అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడిందని అన్నారు. తక్షణమే హామీలు ఇచ్చినటువంటి విద్యా దీవెన వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని తెలిపారు.లేని పక్షాన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అరకు శాసన సభ్యులు రేగం మత్యలింగం,మాజీ శాసన సభ్యురాలు వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు రేగం చాణక్య, యువజన జిల్లా అధ్యక్షులు గబ్బిడి శేఖర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు లోచలి వరప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, అల్లూరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా నియోజకవర్గాల వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు,ఎంపీపీలు ,జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సీనియర్ నాయకులు ,కార్యకర్తలు, విద్యార్థి విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉపాధ్యాయు క్వార్టర్స్

-ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు- పట్టని ఐటీడీఏ

విశాలాంధ్ర -దుంబ్రిగుడ: ఐటిడిఎ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్థానికంగా పాఠశాలల్లోనే అందుబాటులో ఉంటూ విద్యాబోధన అందించాలన్న ఉద్దేశంతో గతంలో ప్రభుత్వం స్థానిక పాఠశాలల్లోనే ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలను నిర్మించి సౌకర్యం కల్పించింది. వాటిని నిర్మించి సుమారు 20 ఏళ్ళు పైబడుతుండడంతో అవి పూర్తిగా మరమ్మతుకు గురై శిథిలావస్థకు చేరాయి. ఐటిడిఏ అధికారులు కూడా వాటిని మరమ్మతు చేపట్టకపోవడంతో అవి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఆ క్వార్టర్స్ భవనాల్లో ఉండలేక బయట అద్దె గదులను తీసుకోవాల్సిన పరిస్థితి. స్థానికంగా ఆ పాఠశాల గ్రామాల్లో అద్దె గృహాలు దొరకక పోవడంతో అరుకులోయ, పాడేరు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిం చాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కించుమండ, దుంబ్రిగుడ, నందివలస, గుంటసీమ, జాంగుడ, కిల్లోగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా అక్కడ ఉపాధ్యాయుల వసతిసౌకర్యం ప్రభుత్వం ఐటిడిఎ ద్వారా గతంలో ఉపాధ్యాయుల క్వార్టర్సులను నిర్మించింది. సుమారు గత ఐయిదారేళ్ల క్రితం నుంచి శిథిలావస్థలో చేరి కూలిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అవి పూర్తిగా శిధిలావస్థలో చేరుకున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి ఉపాధ్యాయ క్వార్టర్స్ భవనాలను మరమ్మతుచేసి పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

చెట్టుపై నుండి జారిపడి బాలుడు మృతి

విశాలాంధ్ర-విఆర్ పురం. అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వీరపావనకుంట గ్రామానికి చెందిన రవ్వ రాంబాబు(11) అను గిరిజన బాలుడు తన ఇంటి ఎదురుగా ఉన్న చింత చెట్టు కొమ్మమీద తన తోటి పిల్లలతో ఆదివారం ఆడుకుంటుండగా చెట్టు కొమ్మ విరగడంతో ప్రమాదవశాత్తు జారి కింద పడిన వెంటనే ఆ బాలుడిని చికిత్స నిమిత్తం చింతూరు హాస్పటల్ కు తీసుకొని వెళ్ళగా డాక్టర్ పరీక్ష చేసి, మూడున్నర గంటల క్రితమే బాలుడు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మూడున్నర గంటల సమయంలో మరణించినాడు. బాలుని తండ్రి రవ్వ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చింతూరు ఏరియా హాస్పిటల్ నందు బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, దర్యాప్తు చేస్తున్నట్లుగా స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్

విశాలాంధ్ర-రంపచోడవరం: పోలవరం నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు సిపిఐ డివిజన్ కార్యదర్శి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్య పరిష్కారం నోచుకోక సంవత్సరాలు గడుస్తున్నాయి అన్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన వినతి పత్రాలు బుట్టదాకలవుతున్నాయే కానీ పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు ప్రస్తుతం ఐటీడీఏ పీవో గతంలో ఆర్ఎస్ఆర్ అధికారిగా పని చేసి ఉన్నారని, దేవీపట్నం మండలంలోని నిర్వాసితుల సమస్యలు ఆయనకు పూర్తిగా తెలిసిన సమస్య పరిష్కరించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. సమస్యపై అవగాహన కలిగిన అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తే నిర్వాసితులు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. రంపచోడవరంలో ఆర్ అండ్ ఆర్ అధికారి ఆఫీసుకు రావడం లేదని, నిర్వాసితులు వారి సమస్యపై వినతి పత్రాలు తీసుకొని కార్యాలయం వద్దకు వచ్చి పడిగాపులు కాచి వెనుతిరుగుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అంశాలపై దృష్టి సారించి నిర్వాసితుల సమస్యకు పరిష్కారం చూపించాల్సిందిగా కోరారు.

పోలీసుల చొరవతో, అంతరాష్ట్ర రహదారి కి - మరమ్మతులు

హర్షం వ్యక్తం చేసిన ప్రయాణికులు, ప్రజలు

విశాలాంధ్ర-జీకే వీధి: గూడెం కొత్త వీధిలో ఉమ్మడి విశాఖ జిల్లా, అంతర్రాష్ట్ర రహదారి గా పేరుగాంచిన ప్రధాన రహదారి గత కొన్నాళ్లుగా పూర్తిగా దెబ్బతిని, మరమ్మతుల కూడా కనీసం నోచుకోకుండా అధ్వాన స్థితిలో ఉంది. ఈ రహదారి మార్గాన ఒరిస్సా, చత్తిస్గడ్, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు ఉన్నాయి. అయితే, గత ఏడాది కురిసిన తుఫాన్ కారణంగా, ఈ జాతీయ రహదారి ప్రమాద భరితంగా, అధ్వానంగా తయారయింది. భారీ వర్షాలకు, కొట్టుకుపోయిన అంతర్ రాష్ట్ర రహదారి, తోపాటు, గాలికొండ పంచాయితీ, చత్రపల్లి ఊరు, ఊరంతా కొట్టుకపోవడంతో పాటు, గ్రామానికి చెందిన ఒకరు మృత్యు వాత పడి, పలురు గాయపడ్డారు. ఈ ఘటనలో భాగంగా పలువురు మంత్రులు సహా ప్రజా పతినిధులు, జిల్లా అధికారులు, పలుమార్లు, ఆర్ వి నగర్ నుండి, లంకపాకల ఘాటీ రోడ్డు వరకు, మరమ్మతులు చేపడతామని హామీలు ఇచ్చారు తప్ప నెరవేరలేదు. ఈ విషయంపై, చింతపల్లి ఏఎస్పి నవ జ్యోతి మిశ్రా, జీకే విధి సిఐ వరప్రసాద్, ఎస్సై అప్పలసూరి ఆధ్వర్యంలో, ప్రమాద భరితంగా ఉన్న అంతర్జాతీయ రహదారి మరమ్మత్తులు చేపట్టాలని, పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే, ఆర్ వి నగర్ నుండి, జీకే వీధి వరకు, ముందుగా సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా, మరమ్మత్తులు చేపట్టారు. అదే కాకుండా సుమారు 12 కిలోమీటర్ల పొడవునా, అత్యంత ప్రమాదక, భరితంగా ఉన్న అంతరాష్ట్ర రహదారిని, సోమవారం ముమ్మరంగా మరమ్మతులు చేపట్టారు. ఈ రహదారి మార్గాన పలుమార్లు, ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో, పోలీసుల చొరవతో అత్యంత ప్రమాద భరితంగా 16 కిలోమీటర్లు ఉన్న, అంతరాష్ట్ర రహదారిని బాగు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి ఏఎస్పి నవజ్యోతి మిశ్రా, జీకే వీధి సిఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి కి ఈ ప్రాంత వాసులు తో పాటు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-కొయ్యూరు: పాడేరు నియోజకవర్గం కొయ్యూరు మండలం సింగవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బాను గారు ఆధ్వర్యంలో రైతులకు 90% శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేసిన జి సి సి మాజీ చైర్మన్ యం వి వి ప్రసాద్, యం పి పి రమేష్ బాబులు ఈ సందర్భంగా ప్రసాదు రమేష బాబులు మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలను రైతాంగం సద్విని యోగం చేసుకోవాలన్నారు మండలానికి సరిపడినన్ని విత్తనాలు వచ్చాయని చాలక పోయినట్లయితే మళ్లీ తెప్పించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలోసర్పంచ్ సోమన్న దొర సింహాచలం ఎంపీటీసీ బీజేపీ నాయకులు చిన్న తదితరులు పాల్గొన్నారు.

నైట్ సర్వీసులు పునరుద్ధరణ

విశాలాంధ్ర-సీలేరు: మావోయిస్టు వారోత్స వాలు ముగిసిన నేపథ్యంలో రద్దు చేసిన రాత్రి సర్వీసులను సోమవారం రాత్రి నుంచి పునరుద్దరణ అయినట్లు ఆర్టీసి అధికారులు తెలిపారు. కావున విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం, భద్రాచలం నుండి సీలేరు మీదుగా విశాఖపట్నం నడిచే నైట్ బస్ సర్వీసు పునరుద్దరణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

విద్యుత్ లేక దుంబ్రిగుడ పై వీధి గ్రామస్తుల అవస్థలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండల కేంద్రం దుంబ్రిగుడ పై వీధిలో విద్యుత్ మరమ్మతుకు గురవడంతో చిమ్మ చీకటితో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నుంచి విద్యుత్తు మరమ్మతుకు గురి అవ్వడంతో పై వీధి గ్రామస్తులు చిమ్మ చీకటిగా ఉండటం వల్ల పక్క ఇంటి కూడా అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిమ్మ చీకటిగా ఉండడం వల్ల చిన్నచిన్న విష జంతువులు సంచరిస్తాయని భయాందోళన కలిగి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోయారు. మరమ్మతుకు గురైన విద్యుత్ను విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేసి విద్యుత్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

గిన్నిస్ రికార్డుకై యోగా పేరుతో గిరిజన విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తగునా?

హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మి

విశాలాంధ్ర-చింతపల్లి: కూటమి ప్రభుత్వంలోని పాలకులు (ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు) తన గిన్నీస్ బుక్ రికార్డు కలను సాకారం చేసుకునేందుకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలతో సహా వందలాది మంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులను విశాఖపట్నం తీసుకువెళ్లి అసౌకర్యాల నడుమ ఆపసోపాలకు (ఇబ్బందులకు) గురి చేయడం ఎంతవరకు సమంజసమని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాంగు సుబ్బలక్ష్మి(చిన్ని) అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి రక్షణ కల్పిస్తూ పరిపూర్ణ ఆరోగ్యాన్ని కలిగించే యోగాను అందరూ స్వాగతించవలసిందే అన్నారు. అటువంటి అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన, పల్లె పల్లెలో ఘనంగా నిర్వహించుకోవడం హర్షదాయకం అన్నారు. మైదాన ప్రాంతాలలో వందల సంఖ్యలో విద్యాలయాలు, వేల సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పటికీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాలన్న తలంపుతో కూటమి పాలకులు మన్య ప్రాంతంలోని ఒక్కొక్క ఆశ్రమ వసతి గృహ పాఠశాలల నుంచి వందల సంఖ్యలో గిరిజన విద్యార్థులను మేకల మందల్ల విశాఖపట్నం తరలించి అసౌకర్యాల నడుమ ఆపసోపాలకు (ఇబ్బందులకు) గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆమె ప్రశ్నించారు. యోగా కార్యక్రమానికి తానేమి వ్యతిరేకం కాదని, మైదాన ప్రాంతంలో వేల సంఖ్యలో విద్యార్థులు ఉండగా కేంద్ర రాష్ట్రాలలో కూటమి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు గిరిజన విద్యార్థులను మేకల వలె తరలించి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడాన్ని మాత్రమే తాను తప్పు పడుతున్నానన్నారు. 5 లక్షల మందితో యోగా నిర్వహించడం అభినందనీయమని, కానీ ప్రయాణికులను ఇబ్బంది పెట్టి, ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టి, గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం కూటమి ప్రభుత్వాల వైఫల్యం అన్నారు. ఇంతటి మహత్తరమైన అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన, పల్లె పల్లెలో, ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోనూ, ఆశ్రమ వసతి గృహ పాఠశాలలు, విద్యాలయాల్లోనూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగానూ నిర్వహించే విధంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించ వలసిన అవసరం ఉందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేగాక విద్యార్థి దశ నుంచి పిల్లలకు యోగా అలవాటు చేయడం వలన రాబోవు తరాలకు ఆరోగ్య ప్రదాయినిగా యోగ విరాజిల్లుతుందని, తద్వారా కూడా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వాల ఆలోచనలు అద్భుతం

టీడీపీ అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం

విశాలాంధ్ర-చింతపల్లి: మంచి మంచి కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్న కూటమి ప్రభుత్వాల ఆలోచనలు అద్భుతమని తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 11వ జాతీయ యోగా దినోత్స వంలో భాగస్వాములు కావడం తమకెంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరూ ఒత్తిడిని తట్టుకునేందుకు, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. యోగాసనాలు వేసిన ఎంపీపీ అనూష దేవి సర్పంచ్ పుష్పలత మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి. తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు 100 నోట్ బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర-బెలగాం : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారు పార్వతీపురం సెంట్రల్ క్లబ్ వారికి విద్యా దానం పథకం సేవా కార్యక్రమంలో భాగంగా 100 లాంగ్ నోట్ బుక్స్ పంపించడం జరిగింది. పార్వతీపురం వాసవీ క్లబ్ అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు స్థానిక ఆడబడి వీధిలో ఉన్న టిఆర్ఎంఎం గర్ల్స్ హైస్కూల్ లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 100 నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వాసవీ క్లబ్ సెక్రటరీ తమ్మన లక్ష్మీ, జిల్లా ఆఫీసర్ పేకేటి పుండరీకాక్ష, క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండపోడు బంజరు భూములకు గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూ రంగి సీతారాం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని టీకే జమ్ము పిటిమండ అర్నాడ అలమండ, కొండచిలకాం పంచాయతీల పరిధిలో గిరిజనులు కొండపోడు భూములు బంజర భూములు గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారు దీనికి పట్టాలి ఇవ్వాలని చాలా సంవత్సరాలుగా వినతలిస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం చేసి ఈ సమస్య పూర్తి పరిష్కారం అయ్యేంతవరకు పోరాడి తీరుతామని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఎటువంటి దుర్ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా జియ్యమ్మ వలస మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

చివర భూమి వరకు నీరు అందించే ప్రణాళిక

ఇరిగేషన్ డిఈఈ రవి కుమార్

విశాలాంధ్ర-కురుపాం: కురుపాం నీటిపారుదల సబ్ డివిజన్ పరిధిలో గల రిజర్వాయర్లు కు సంబంధించి వచ్చే ఖరీఫ్ సీజన్లో చివర భూమి వరకు నిరంధించే ప్రణాళికను రూపొందిస్తున్నట్లు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్ అన్నారు సోమవారం సబ్ డివిజన్ కార్యాలయంలో నీటి సంఘం అధ్యక్షులతో నబ్ డివిజన్ సంబంధించి ఇంజనీర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు వచ్చే ఖరీఫ్ సీజన్లో తమ పరిధిలో గల రిజర్వాయర్లకు పేరుకుపోయిన పూడికలు తీయించి చివర భూమి వరకు నీర అందించేందుకు ఒక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులతో పాటు ఒట్టి గెడ్డ రిజర్వాయర్ ఇంజనీర్ రఘు, రవి అలాగే మొండెంకల్ ,కురుపాం ఏఈ శంకర్రావు ఒట్టిగడ్డ రిజర్వాయర్ అధ్యక్షులు సత్యం నాయుడు నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో సాగుభూములకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర-కురుపాం: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేస్తున్నా భూములు కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా గిరిజన సంఘం నాయకులు మండంగి శ్రీనివాస్, మండంగి అడ్డమేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు భూములు సాగుచేస్తున్నప్పటికీ వారికి సంపూర్ణ హక్కులు లేవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సాగు భూములు కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఉపతహశీల్దార్ సురేష్ కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా అధ్యక్షుడు కొల్లి గంగునాయుడు ,వివిధ గ్రామాల్లో ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ కి సత్కారం...

విశాలాంధ్ర-పాలకొండ: పాలకొండ ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న పట్నాల వెంకటేశ్వరరావుకు సోమవారం ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రెటరీ భాసూరు కృష్ణమూర్తి, డిపో కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు,పార్వతీపురం మన్యం జిల్లా కు డిపిటీవోగా ఇన్చార్జి ప్రమోషన్ పై వెళ్తున్న సందర్భంగా సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ డిపోలో ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి దుర్గారావు డిపో నాయకులు బిఆర్ కుమార్ ఎంకే రావు ఆచారి సత్య రావు వెంకటరమణ తిరుపతి పండ చంద్రమౌళి తో పాటు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

జీవో 5ను సవరించాలి

విశాలాంధ్ర-పాలకొండ:పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 9 సచివాలయాల సిబ్బంది సోమవారం నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో ధర్నాకు దిగారు జీవో నెంబర్ 5 ను తక్షణమే సవరణ చేయాలని ప్రమోషన్స్ లేకుండా బదిలీలు చేయడం ఏమిటని ప్రశ్నించారు సీనియార్టీ మరియు రోస్టర్ విధానం మేరకే ప్రమోషన్స్ కల్పించాలని తదితర అంశాలపై తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు అనంతరం కమిషనర్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు వాసుదేవరావు రవీంద్ర షణ్ముఖరావు శివకృష్ణ వరలక్ష్మి భారతి తదితరులు పాల్గొన్నారు.

కళల వికాసానికి, కళాకారుల సంక్షేమానికి మార్గం సుగమం.

- అల్లూరి జిల్లా నృత్య కళాకారుల సంఘం ఏర్పాటు
- కళాకారుల అభ్యున్నతికి ఏకగ్రీవ తీర్మానం

విశాలాంధ్ర -చింతపల్లి: కళల వికాసానికి, కళాకారుల సంక్షేమానికి మార్గం సుగమం కానుందని అల్లూరి జిల్లా నృత్య కళాకారుల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మోరి రవి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన నిత్య కళాకారుల సమావేశానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నృత్యకళలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడా నికి సంపూర్ణ సహకారం అందించాలని, తద్వారా కళాకారుల గౌరవాన్ని నిలబెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కీలక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్టాసింగి అశ్విన్ , ఉపాధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా చంటి, కోశాధికారిగా యేసు, సంయుక్త కార్యదర్శిగా నారిలు ఎన్నికయ్యారు. త్వరలోనే వారు బాధ్యతలు చేపట్టనున్నారన్నారు. సంఘ గౌరవ అధ్యక్షులుగా చిన్నా, రాజు, సురేష్ పట్నాయక్, అజయ్ సాయిలను నియమించు కున్నారు. కార్యక్రమం లో జిల్లాలోని పలువురు డ్యాన్స్ కొరియోగ్రాఫర్లు,, అధిక సంఖ్యలో డ్యాన్సర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. ఈ సంఘం ఏర్పాటుతో జిల్లాలో కళల వికాసానికి, కళాకారుల అభ్యున్నతికి మార్గాలు సుగమం అవుతాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కురుపాం తహసీల్దార్ గా జయ బాధ్యత స్వీకరణ



విశాలాంధ్ర-కురుపాం: కురుపాం నూతన తహశీల్దార్ గా కె.జయ సోమవారం బాధ్యత లు స్వీకరించారు. గతంలో పని చేసిన తహశీల్దార్ ఎం.రమణమ్మ బదీలీలు లో భాగంగా భోగాపురం వెళ్ళటం తో కలెక్టరేట్ లో ఓ సెక్షన్ ఎఓ గా పని చేసిన కె.జయ బదిలీ పై వచ్చి భాధ్యతను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పిర్యాదు లు ,సమస్యలు పై నేరుగా సంప్రదించాలని సూచించారు. నూతన భాధ్యతను స్వీకరించిన ఆమె తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది. విఆర్వో లు శుభాకాంక్షలు తెలిపారు.

సీతంపేట గ్రామపంచాయతీలో పీఎం డిఎ జుగా గ్రామసభ



విశాలాంధ్ర-సీతంపేట: పంచాయతీ కార్యాలయంలో సోమవారం పి యం డి ఏ జూగా గ్రామ సభలో ఎవరైతే గిరిజనులు ఉన్నారు వారు అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ఉండే విధంగా చేయడానికి పిఎండిఏజుగా అనేది ఎంతగానో ఉపయోగపడు తుందని డిప్యూటీ డిఇఓ జి రామ్మోహన్ రావు తెలియజేయడం జరిగింది.సదరు గ్రామ సభలను అందరూ గిరిజనులు ఉపయోగించుకొని వారు కావలసిన వ్యక్తిగతంగా గాని సామాజికంగా గాని వారికి అవసరం అవుతాయో వాటిని వినతిపత్ర రూపంలో తెలియజేసి లబ్ది పొందవలసిందిగా డిప్యూటీ డీఈవో తెలియజేశారు. సదరు కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, వైస్ ఎంపీపీ కొండంగి. సరస్వతి, కూటమి నాయకులు బిడ్డిక. జయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో బి రామకృష్ణ, అందరు మండల స్థాయి సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది ఐ సి డి ఎస్ సిబ్బంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ఉపాధి పనుల్లో తప్పు జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం!

విశాలాంధ్ర-గంగవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల్లో అవినీతి జరిగితే చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని పిడి డా. విద్యాసాగర్ అన్నారు. సోమవారం ఉపాధి హామీ పథకం 2024-25లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ మండలంలో 17 పంచాయతీల్లో 17 కోట్ల వ్యయంతో ఉపాధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. పనులు పై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పనుల్లో నాణ్యత లోపం అక్రమాలు జరిగితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి జడ్పిటిసి బేబీ రత్నం , వైస్ ఎంపీపీ గంగాదేవి, ఏ పి డి యల్. రాంబాబు, ఎంపీడీవో లక్ష్మణరావు, సోషల్ ఆడిట్ ఎస్ సి ఆర్ పి పున్నపు నాయుడు, విజిలెన్స్ ఆఫీసర్ సురేష్ కుమార్ , ఉపాధి ఏపీవో ప్రకాష్, తదితరులు ప్రసంగించారు. అనంతరం సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పంచాయతీలు వారీగా ఆడిట్ రిపోర్ట్ ను ప్రజావేదికకు సమర్పించారు.

పార్లమెంట్ సింహం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: డాక్టర్ శ్యామ్ ప్రసాద్ పార్లమెంటు సింహంగా పేరుపొం దారని పార్వతిపురం నియోజకవర్గ బిజెపి కన్వీనర్ సొండి సంజీవ్ మాస్టర్ అన్నారు. శ్యాం ప్రసాద్ వర్ధంతి సందర్భముగా ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర భారత దేశానికి మొదటి కేంద్ర మంత్రివర్గంలో పరిశ్రమలు శాఖ మంత్రిగా, పనిచేసారనీ అప్పటి పార్లమెంటుకులో పార్లమెంట్ సింహంగా పేరు పొందారన్నారు. గొప్ప దేశభక్తుడు, మేధావి, అయిన డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీకలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలరు గా పనిచేసే కాలంలో ఉన్నత విద్యలో అనేక సంస్కరణలు చేశారనీ,కలకత్తా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారన్నారు.1951 అక్టోబర్ 21 తేదీన భారతీయ జనసంఘ్ పా ర్టీ స్థాపించి భారత రాజ్యాంగంలో జమ్ము కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే అధికరణ 370 ని గట్టిగా వ్యతిరేకించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుపరిపాలన సమీక్షలో పాల్గొన్న జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు

విశాలాంధ్ర-పార్వతీపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో సోమవారం నాడు జరిగిన ఎన్డీఏ కూటమి ఏడాది సుపరిపాలన సమీక్ష సమావేశంలో పార్వతీపురం మన్యంజిల్లా నుండి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రతో పాటు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డిలు పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వచ్చే నాలుగేళ్లలో చేపట్టాల్సిన పనులను ముఖ్యమంత్రికి విన్నవించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గూర్చి శాంతి పద్ధతుల గురించి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా ఎస్పీమాధవ్ రెడ్డిలు సమావేశంలో వివరించారు.

తక్షణమే 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి

విజయవంతమైన యువత పోరు కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా మేనిఫేస్ట్ లో చెప్పిన ప్రకారం నిరుద్యోగులకు ఇస్తామన్న 3,000 నిరుద్యోగ భృతితో పాటు ఇస్తామన్న 20లక్షల ఉద్యోగాలు ఇవ్వక పోగా, అటు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా పోయిన కూటమి ప్రభుత్వంనీ నిలదీస్తూ జిల్లా వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలో గల వైయస్ఆర్ విగ్రహం వద్ద నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా యువత పోరు నిరసన కార్యక్రమం నిర్వహించడంతో పాటు జిల్లా రెవిన్యూ అధికారిని హేమలత కి వినతిపత్రం అందచేసి నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణం అమలు చేశాలా చర్యలు తీసుకోవాలని వైసిపి యువజన విభాగం నాయకులు డిమాండ్ చేస్తూ అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా యూత్ ప్రెసిడెంట్ శరత్ బాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వైసిపి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు పక్షాన నిలబడి ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని నిరుద్యోగ భృతి తో పాటు ఉద్యోగ కల్ప కల్పించాలని కోరుతూ ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినపత్రం సమర్పించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని మేనుకోండి నేర్పించిన పార్వతిపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జోగారావు మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాడు మేనిఫెస్టో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఇప్పటికే గత ఏడాది కాలంగా నెలకు 3000 చొప్పున 36,000 నిరుద్యోగ భృతి బాకీ పడ్డారు అని, అలానే 20లక్షల ఉద్యోగాలు కల్పించాలని, తీసిన ఉద్యోగాలు ఇప్పించాలని వైసిపి తరుపున రాష్ట్ర వ్యాప్తంగా నేడు యువత పోరు కార్యక్రమం ద్వారా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు నగిరెడ్డి శరత్ బాబు, కురుపాం నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ పల్లా అనంత నాయుడు, పార్వతీపురం నియోజకవర్గం యూత్ వింగ్ ప్రెసిడెంట్ కోరాడ శేఖర్, పార్వతీపురం టౌన్ యూత్ ప్రెసిడెంట్ %దీు% సంతోష్ కుమార్, పార్వతీపురం రూరల్ యూత్ ప్రెసిడెంట్ ఉరిటి అప్పలనాయుడు, సీతానగరం యూత్ ప్రెసిడెంట్ దాసరి కిషోర్, బలిజిపేట యూత్ ప్రెసిడెంట్ రణదేవ్ లక్ష్మణరావు, పార్వతీపురం నియోజకవర్గం స్టేట్ యూత్ జాయింట్ సెక్రటరీ ముగడ జగన్ మోహన్ రావు, కురుపాం నియోజకవర్గం స్టేట్ యూత్ సెక్రటరీ నిమ్మక గోపాల్, కురుపాం నియోజకవర్గం స్టేట్ యూత్ జాయింట్ సెక్రటరీ షైక్ నిషార్, సాలూరు నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ పొటంగి అచ్యుతరావు, పాలకొండ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ పొట్నూరు లక్ష్మణ రావు లతో పాటు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ఆర్ వి నగర్ వైద్యాధికారి రాజా రవీంద్రనాథ్ చౌదరి

- వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత అవసరం
-దోమతెరలు వినియోగించండి, వేడి పదార్థాలను భుజించండి

విశాలాంధ్ర-చింతపల్లి: వాతావరణ మార్పుల కారణంగా ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్ వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజా రవీంద్ర నాథ్ చౌదరి అన్నారు. మండలం లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహ పాఠశాలలలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహ పాఠశాలలు, కళాశాలలు, పాలిటెక్నిక్ విద్యార్థులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కార్మికులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ రుగ్మతలు కలిగిన సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. ఈ క్రమంలో ఆశ్రమ వసతి గృహ విద్యార్థిని, విద్యార్థులకు వాతావరణ మార్పులు తద్వారా వ్యాపించే వ్యాధులు, తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మధుమేహము, రక్తపోటు తదితర సమస్యలతో బాధపడుతున్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కార్మికులకు, అదే క్రమంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య సేవలు అందించడంతోపాటు, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన్య ప్రాంతంలో వాతావరణ మార్పులు ప్రారంభం అయ్యాయని, పనస, అనాస పనస, మామిడి పండ్ల సీజన్ కావడం, అడపా దడపా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అదే క్రమంలో దోమల బారి నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు నియోగించాలని, కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలని, వేడి పదార్థాలను భుజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఏఎన్ఎం లక్ష్మమ్మ, గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహ ప్రధానోపాధ్యాయులు బిఎస్ఎన్ రాజు, వసతి గృహ అధికారిని పాంగి సూకరత్నం, పి ఈ టి వరలక్ష్మి, ఆశా కార్యకర్తల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పద్మ, అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, అధిక సంఖ్యలో గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహ విద్యార్థినీ, విద్యార్థులు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కార్మికులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ ఫేక్ అంటున్న విఆర్ఓ

ఇచ్చిన ధ్రువీకరణను ఫేక్ అనడంపై తాసిల్దార్ మండిపోటు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని తురక నాయుడు వలస లోగత 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఎర్రగొల్లలు తాము ఎస్టీ ఎరుకల కులానికి చెందిన వారమని తమకు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని సోమవారం తాసిల్దార్ వై విజయలక్ష్మి కోరారు.రెండేళ్లుగా తమ పిల్లలకు కుల ధ్రువీకరణ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, చిన్నపిల్లలను స్కూల్ ,వసతి గృహానికి తీసుకువెళ్లాలన్న , కాలేజీ చదువులకు కుల ధ్రువీకరణ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు తహసీల్దార్ , కలెక్టర్ దృష్టికి వీరి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ ఇంతవరకు వారికి న్యాయం జరగలేదని అన్నారు.దీంతో నాలుగు జిల్లాల నుండి తమ కులానికి చెందినవారు ఎస్టీ ఎరుకల అంటూ అనేకమంది తాసిల్దారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను తీసుకొని ఎస్టీ ఎరుకుల సంఘం ట్రెజరర్ పి రామారావు, బి రాము ప్రభుత్వ గెజిట్ను చూపిస్తూ తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందించారు. దీంతో తాసిల్దార్ వీఆర్వో రాధను కాల్ చేసి విషయాన్ని అడగ ఆమె ఎర్రగొల్లు ఎస్టి ఎరుకలు కాదని, వారంతా గొల్లలేనని చెప్పడంతో 2020లో జియ్యమ్మ వలస తహసీల్దార్ పనిచేసిన గిరిధర్ ఇచ్చిన ఎస్టీ సర్టిఫికెట్ను ఫేక్ సర్టిఫికెట్ అని నువ్వు ఎలా చెప్తావని ఆమెపై మండి పడ్డారు. దీంతో వారంతా తహసీల్దార్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని ఫేక్ సర్టిఫికెట్ అని వీఆర్వో రాతపూర్వకంగా ఇస్తే మంచిదని అన్నారు. అనంతరం తురక నాయుడు వలస లో గ్రామసభను నిర్వహిస్తామని తదుపరి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెలతామని జయలక్ష్మి తెలిపారు.

మా బడి మాకు కావాలి

పెదపెంకీ గ్రామ చిన్నారుల ఆవేదన

కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మా బడి మాకు కావాలి అని కోరుతూ మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెదపెంకి గ్రామ విద్యార్థులు నిరసన తెలియ చేస్తూ గ్రీవెన్స్ లో అధికారులకు వినతిపత్రం అందచేసారు.ఈ నిరసన కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు అలజంగి.జోగారావు మద్దతు తెలిపి మాట్లాడుతూ నియోజకవర్గంలోని బలిజీపేట మండలం, పెదపెంకి గ్రామం దళిత వాడలో గల పెద్దపెంకి ఎంపీపీ -1 ప్రాథమిక పాఠశాల 3, 4, 5 తరగతులను వేరే మోడల్ పాఠశాలలో విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసినది మొదలు ఆ పాఠశాల పరిధిలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు విద్య సహితం లేకపోవడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. తమ దళితవాడలో గత 40ఏళ్లకు పైగా కొనసాగుతూ వస్తున్న ప్రాథమిక పాఠశాల ను తొలగించ వద్దనీ ఇప్పటికే అనేక మార్లు మండల అధికారులు, జిల్లా అధికారులకు తమ గోడు మొర పెట్టుకున్నప్పటికీ ఇంతవరకు ఎవరూ స్పందించడం లేదని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి లోకేష్ తక్షణం స్పందించి వారి పాఠశాలను యదావిధిగా కొనసాగేలా చూడాలని లేనియెడల వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున పోరాటం చేపట్టడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గుడివాడ నాగమణి, సర్పంచ్ నగిరి పాపారావు, స్కూల్ కమిటీ చైర్మన్, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాక్సైట్ కొల్లగొట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ

గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్

విశాలాంధ్ర-బెలగాం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, అనంతగిరి, అరకు తదితర మండలాల్లో పరిధిలో ఉన్న విలువైన "బ్యాక్సైట్ " ను కొల్లగొట్టేందుకు జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి) ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సహజ సంపదను కొల్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు రంజిత్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేసారు. గతంలో ఇటువంటి కుట్రలు చేస్తే గిరిజనులు తిప్పి కొట్టారని వివరించారు. ఇది "షెడ్యూల్డ్ " ఏరియా భూభాగమని 1/70 చట్టం ఉంటే తవ్వకాలు సాధ్యం కాదని అందుకే ఆ 1/70 చట్టం రద్దుకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం అయ్యాయన్నారు. తవ్వకాలను అడ్డుకునేందుకు గిరిజనులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే జీఓ3 లేకుండా ఉపాధ్యాయుల నియామకం చేపట్టి గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్రమైన అన్యాయం చేసిన ప్రభుత్వాలు 1/70 చట్టం రద్దు, సవరణ అని చెప్పి గిరిజనులకు భూమిపై హక్కు లేకుండా చేసేందుకు సిద్ధపడ్డారని తెలిపారు.

మంత్రి నారా లోకేష్ తో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-అనంతగిరి: అమరావతిలో జరిగిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆత్మీయంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రజలందరు సంతోషంగా ఉన్నారని సూపర్ సిక్స్ పథకంలో భాగంగా కుటుంబంలో చదువుకున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వర్తింప చేసిన గొప్ప ప్రభుత్వం టీడీపీ కూటమి ప్రభుత్వమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారాని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

బదిలీ అధికారినికి ఘన సనానం

విశాలాంధ్ర-కొయ్యూరు :మండల వ్యవసాయ శాఖ అధికారి గా సుదీర్ఘకాలం పనిచేసిన ఉమాదేవి ఇటివల సాధారణ బదిలీలో బదిలీ అయిన సందర్భంగా జి సి సి మాజీ చైర్మన్ యం వి వి ప్రసాద్ , యం పి పి రమేష్, స్థానిక సర్పంచ్ లు సింహాచలం, సోమన్న దొర బిజెపి నాయకులు చిన్న స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంవి ప్రసాద్ రమేష్ బాబులు మాట్లాడుతూ వ్యవసాయ అధికారినిగా మండలంలో విశేష సేవలు అందించిన ఉమాదేవి బదిలీపై వెళ్ళటం బాధాకరంగా ఉందన్నారు ఉద్యోగులకు బదిలీలు సహజమైనప్పటికీ అధికారులతో పాటు మండల రైతాంగానికి నిత్యం అందుబాటులో ఉంటూ ఉద్యోగానికి వన్నెతెచ్చారన్నారు తాను నిత్యం కష్టపడుతూ కింది ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ రైతాంగానికి ఏ నలేని సేవలు చేశారని కొనియాడారు.

ఉపాధ్యాయులు లేక తెరుచుకోని సీలేరు ఎంపిపి పాఠశాల

విశాలాంధ్ర-సీలేరు: జీకేవీధి మండలం సీలేరు ఎంపిపి పాఠశాల తెరుచుకోలేదు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో ఉపాధ్యాయులందరూ బదిలీ కావడంతో ఇక్కడ పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేక పాఠశాల తెరుచుకోని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు లేక పాఠశాల తెరవక తమ పిల్లల భవిష్యత్ ఏమౌతుందోనని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను తెరిపించి తమ పిల్లలకు విద్యాబోధన చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ లు త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పిజిఆర్ఎస్) వచ్చే దరఖాస్తులకు పారదర్శకంగా పరిష్కారం చూపించాలని జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత అన్నారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సుధారాణితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సమస్యలతో వచ్చే వారి ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు, మానవతా కోణంలో ఆలోచించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని డిఆర్ఓ అన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల,డివిజనల్, మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునని సూచించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ కు 203 దరఖాస్తులు అందాయన్నారు. సోమవారం గ్రీవెన్స్ కిటకిటలాడింది. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమటి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూసి వేయడం వలన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారని, విద్యార్థుల భవిష్యత్తు కొరకు ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించాలని కోరారు. బలిజిపేట మండలం పెద్ద పెంకి గ్రామంలో ఉన్న ఎం.పి.పి స్కూల్ - 1 ను వేరే మోడల్ స్కూల్ లో విలీనం చేయడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, స్కూల్ విలీనం ప్రక్రియ చేయవద్దని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతూ దరఖాస్తు అందజేశారు.గరుగుబిల్లి మండలం హిక్కింవలస గ్రామ పాఠశాలలో 3,4,5 వ తరగతి చదువుతున్న విద్యార్థులను గరుగుబిల్లి హైస్కూల్లో కలపడం వలన మా పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని, హై స్కూల్ కి పంపిన విద్యార్థులను హిక్కింవలస ప్రాథమిక పాఠశాలకు పంపించి, యం.పి.పి.స్కూల్ హిక్కింవలస ను మోడల్ ప్రైమరీ పాఠశాల గా చేయాలని గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్,డిఎంహెచ్ఓ డా. ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, ఇంచార్జి జిల్లా విద్యాశాఖధికారి బి.రాజ్ కుమార్, పార్వతీపురం కో ఆపరేటివ్ అధికారి,ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిరియాల చోరీ నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-జీకే విధి : మండలంలోని ఆర్ వి నగర్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కు చెందిన 25 బస్తాల మిరియాలను ఈనెల 5వ తారీఖున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ చోరీ సంఘటనపై సంబంధిత ఫారెస్ట్ అధికారులు జీ.కే వీధి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ వరప్రసాద్,ఎస్ఐ అప్పలసూరి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాహన తనిఖీలలో భాగంగా బైక్ పై వస్తున్న ముగ్గురు వ్యక్తులను దేరాల జంక్షన్లో అదుపులోని తీసుకొని విచారించగా ఒకరు సంబంధిత ఫారెస్ట్ భవనంలోని వాచ్మెన్ గా విధులు నిర్వహిస్తూ మరో ఇద్దరి సహాయంతో దొంగతనానికి పాల్పడినట్టు తెలిపారు. గొల్లూరి నాగు గతంలో గంజాయి కేసులో అరెస్ట్ బెయిల్ పై వచ్చిన గొల్లూరి నాగు, రాజ్ కుమార్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో వాచ్మెన్ గా పనిచేస్తున్న రాజకుమార్, మరో వ్యక్తి నాగరాజు ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకొని ప్రశ్నించగా నేరం అంగీకరించారన్నారు. వారి దగ్గర నుండి 5 బస్తాల మిరియాలు ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దొంగతనం చేసిన మిరియాల విలువ సుమారు రూ. 6 లక్షల పై మాటే ఉంటుందని అంచనా వేశారు.నిందితులకి రిమాండ్ నిమిత్తం తరలించామని పోలీసులు తెలిపారు.

బీజేపీ ఆద్వర్యం లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సంస్మరణ దినోత్సవం..

విశాలాంధ్ర-వై.రామవరం: మండలం లోని బుల్లోజి పాలెం గ్రామంలో సోమవారం మండల బీజేపీ అధ్యక్షులు కడబాల ఆదివిష్ణు ఆద్వర్యం లో డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు.ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ముఖర్జీ సంస్మరణ దినోత్సవాన్ని బలిదాన దివాస్ గా కూడా పిలుస్తారని ఈ.ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.కార్యక్రమం లో బీజేపీ మహిళా నాయకురాలు స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

కమీషనర్ కు వినతిపత్రం ఇచ్చిన ఉద్యోగులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఈ పురపాలక సంఘములో రెవెన్యూ అధికారిగా పనిచేయుచున్న డి.రూబేను పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం లో పనిచేస్తున్న ఉద్యోగులు కమీషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు కు సోమవారం వినతిపత్రం అందజేశారు.రెవెన్యూ అధికారి కార్యాలయ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, మాట తీరు అసభ్యకరముగా ఉన్నవనీ కార్యాలయ విషయము పట్ల కాకుండా సిబ్బందికి వ్యక్తిగత దూషణలు చేస్తూ మహిళా సిబ్బంది పై చాలా అసభ్యకర పదజాలాలతో దూషిస్తూ, తోటి ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే విధముగా ఉన్నాయని అందువలన మా యొక్క విధులను సక్రమముగా నిర్వహించలేక ఎంతో మనోవేధనకు గురి అగుచున్నామనీ, కావున కమీషనరు సంబంధిత రెవెన్యూ అధికారి వారిపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని లేని యెడల మా యొక్క విధులు సక్రమముగా నిర్వహించలేమని సదరు రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకున్నంత వరకు మా యొక్క విధులను బహిష్కరిస్తున్నామని ఆ వినతి పత్రములో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ జి లక్ష్మి, జేఏవో అశోక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు బి ఈశ్వరరావు పి శ్యామల డి సురేష్ కుమార్ కే త్రినాథ్ బి తులసి కే పుష్పలత జూనియర్ అసిస్టెంట్లు ఎంపీ శైలజ బి హేమలత కే అనంత కుమార్ జే హేమంత్ టి పద్మావతి జి వినయ్ కుమార్, కె రామారావు ఎం దుర్గమ్మ టి చింతల్లి తోపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు డిపిఓ ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తా

- స్థానిక ఏరియా ఆసుపత్రిలో చిన్న పిల్లలు వైద్య నిపుణురాలిగా డాక్టర్ నీలవేణి నియామకం - బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నీలవేణి

విశాలాంధ్ర-చింతపల్లి: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి లో చిన్న పిల్లల వైద్య నిపుణురాలి గా(చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ , సివిల్ సర్జన్) డాక్టర్ ఎం నీలవేణి ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఆమె చింతపల్లి ఏరియా ఆసుపత్రి లో చిన్నపిల్లల వైద్య నిపుణురాలు(చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ సివిల్ సర్జన్)గా విధుల్లో చేరారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ సాధారణ బదిలీ లలో భాగంగా ఆమెను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి నుంచి చింతపల్లి ఏరియా ఆసుపత్రికి బదిలీ చేశారు..దీంతో ఆమె చింతపల్లి ఆసుపత్రిలో సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్య ప్రాంతంలో చిన్న పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ఈ క్రమంలో ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బందితో సమన్వయంతో పని చేస్తానని, స్థానిక ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బీజెపి అగ్ర నాయకుడు టంకాల మృతి

విశాలాంధ్ర-పాలకొండ.: పాలకొండ పట్టణ బిజెపి అగ్ర నాయకుడు ఉమ్మడి పూర్వపుజిల్లాల బిజెపి అధ్యక్షుడు ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు సోమవారం గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువాత పడ్డారు ఈయన మరణం పాలకొండ పట్టణానికే కాదు జిల్లాకే తీరనిలోటని ఆయన అభిమానులు పేర్కొన్నారు దుర్గారావు మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా బలిదాన్ దివస్

- భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి.

- శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చింతపల్లి: మహోన్నత దేశభక్తుడు భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి (బలిదాన్ దివస్) కార్యక్రమాన్ని చింతపల్లిలో 133, 137 శక్తి కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదుళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు , విశేషమైన కృషి చేసిన మహోన్నతుడు ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలిచిన భరత మాత ముద్దుబిడ్డ , రాజనీతిజ్ఞుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు. విద్యావేత్తగా , బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన.శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం బలిదానమై నేటికీ 72 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగాఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందని, ఈ సందర్భంగా ఆయన సేవలను వక్తలు స్మరించు కన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహి చెలాగే అని నినదించారని, సమున్నత సమైక్య భారత్ కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన మహోన్నత దేశ భక్తుడని కొనియాడారు. ప్రతీ భారతీయులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మైనారిటీ మోర్చా.జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

విశాలాంధ్ర-ఎటపాక: ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చింత దుర్గారావు అధ్యక్షతన నెల్లిపాక గ్రామంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మండల అధ్యక్షులు నలజాల శ్యాంప్రసాద్, భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడే సతీష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ భారతదేశ ఐక్యత ,సమగ్రతను కాపాడేందుకు ,విశేషమైన కృషి చేసి,ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలిచిన భరత మాత ముద్దుబిడ్డ ,రాజనీతిజ్ఞుడు ,డాక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ విద్యావేత్త బహుముఖ ప్రజ్ఞాశాలి భారతీయ జనసంఘ వ్యవస్థ స్థాపకులు ,డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ గారి 72వ వర్ధంతి (బలిదాన్ దివాస్)సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుందా మని, దేశ సమైక్యత సమగ్రత కోసం ఏక్ దేశ్ మే దోవిధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహి చలగే అని నినదించారని, సమున్నత సమైక్య భారత్ కోసం పోరాటం చేసిన ప్రాణాలు అర్పించిన మహోన్నత దేశ భక్తుడని కొనియాడారు. ప్రతీ భారతీయులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మడకం వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు కొరసా రామకృష్ణ, మేకల రాజు సోడా శేఖర్ పాయం సంతోష్ తెల్లం శ్రీను చింటూ తదితరులు పాల్గొన్నారు.